కేసుల రాజీకి ప్రయత్నించండి : జిల్లా జడ్జి

భీమవరం టౌన్ : డిసెంబర్ 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ క్రిమినల్ కేసుల రాజీకి ప్రయత్నం చేయాలని, రాజీకి అవకాశమున్న కేసులను కోర్టు దృష్టిలో పెట్టాలని, కేసుల విషయాల్లో ఇబ్బందులుంటే సంబంధిత మేజిస్ట్రేట్లకు తెలియజేస్తే వాటికి పరిష్కారం సూచిస్తారని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీ నారాయణ అన్నారు. సోమవరం జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో న్యాయమూర్తి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్ల పరిధిలో పెండింగులో వున్న రాజీకాదగ్గ కేసుల వివరాలు, రాజీకి అనుకూలంగా వున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులు రాజీకి తీసుకోవలసిన చర్యల గురించి సూచనలు చేసారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.హనీష, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి, బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ నాగరాజు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉండవల్లి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

చేప ధర డీలా!

- పెరిగిన పెట్టుబడులు
- మోయలేనంతగా మేత ఖర్చు
- నష్టాల బాటలో చేపల రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

రొయ్యల సాగే కాదు.. లాభాలు సంపాదించి పెడుతుందని భావించిన చేపల సాగు కూడా రైతులకు ప్రస్తుతం భారంగా మారింది. కార్తీక మాసం కావడంతో తెల్ల చేపలు కట్టు, శీలావతి, ఫంగస్, రూప్‌చంద్ వంటి పలు రకాల చేపల ధరలు తగ్గుముఖం పట్టాయి. కొల్లేరు, ఉప్పుటేరు, సముద్ర తీరప్రాంతాల్లో శీలావతి, ఫంగస్, రూప్‌చంద్ వంటి రకాల చేపలను సాగు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల వరకూ చేపల సాగు సాగుతోంది.

చేపల సాగు చేసే రైతులు గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కొన్నాళ్లుగా పెరుగుతున్న పెట్టుబడులు, క్షీణిస్తున్న ధరలతో ఈ రంగం సంక్షోభంలోకి వెళ్తోంది. దశాబ్ద కాలంగా చేపల సాగులో ఉన్న వారు సైతం నిరాశలో ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు చేపల ధర తగ్గడంతోపాటు మరోవైపు ఫీడ్ ధరలు విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు చేపల పట్టుబడులు చేస్తున్నారు. ఇదే అదునుగా తీసుకుని చేపల కొనుగోలుదారులు ధర తగ్గించేస్తున్నారని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో దిగుమతులు సైతం తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో కేజీన్నరకుపైగా బరువు పెరిగిన చేపలు పట్టుబడులు చేస్తున్నారు. ఆకివీడు, భీమవరం, కైకలూరు, గణపవరం పరిసర ప్రాంతాల నుంచి దేశంలో అనేక ప్రాంతాలకు సుమారు 200 లారీల సరుకు ప్రతిరోజూ ఎగుమతి అవుతుంది. ఫీడ్ ధరలు ఆకాశాన్నంటడంతో చేపల సాగు అయోమయంలో పడిపోయింది. దీంతో సిరులు కురిపించిన తెల్ల చేప ఇప్పుడు నష్టాల ఊబిలోకి నెడుతోంది. గతంలో కిలో చేప ధర రూ.125 ఉండేది. ప్రస్తుతం రూ.118కి తగ్గింది. రూప్‌చంద్ గతంలో రూ.120 ఉండేది. ప్రస్తుతం రూ.83కు తగ్గింది. అయితే పెట్టుబడులు మాత్రం రెండు రెట్లు పెరిగాయి.

చేపల మేతైన డిఒబి తవుడు పది టన్నులు రూ.1.20 లక్షలు ఉండేది. ఒక్కసారిగా రూ.50 వేలు పెరిగి ప్రస్తుతం రూ.1.70 లక్షలకు చేరింది. చేపలు కిలో నుంచి కిలోన్నర వచ్చేందుకు సుమారు ఆరు నెలల సమయం పడుతుంది. ఎకరం చెరువులో మూడు వేల వరకు చేప పిల్లలు వదులుతారు. చేప కిలో బరువు పెరిగేందుకు ఐదు కిలోల మేత తింటుంది. చేప ధర తగ్గడం, మేత ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక చెరువుల లీజు ధరలు ప్రస్తుతం పెరిగాయి. ఎకరం చేపల చెరువు లీజు ధర రూ.1.20 లక్షలు ఉంది. గతంలో రూ80 నుంచి రూ.90 వేలు మధ్య ఉండేది. రొయ్యల సాగు చేసే చెరువుల్లోనే చేపల సాగు చేస్తుండటంతో చెరువు లీజు ధరలు పెరిగాయి.

తవుడు (డిఒబి) ధర తగ్గించాలి

మంతెన పెద నరసింహమూర్తిరాజు, చేప రైతు, కలవపూడి

తవుడు (డిఒబి) ధరను తగ్గించాలి. చేపల సాగులో నీటి కాలుష్యంతో పలు రకాల వ్యాధులు ఆశించడం, మరోవైపు ఫీడ్ ధరలు కూడా విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు రాని పరిస్థితి ఏర్పడింది. చేపలు, రొయ్యల సాగు లాభాల దిశగా సాగినప్పుడు ప్రభుత్వానికి రూ.కోట్లలో విదేశీ మారకద్రవ్యం రూపంలో ఆదాయం సమకూరింది. చేపల రైతులు ప్రస్తుతం నష్టాలతో సతమతమవుతున్న తరుణంలో టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడేలా చర్యలు తీసుకోవాలి.

ఘాతుకం

తల్లిని, తమ్ముడిని హత్య చేసిన కసాయి

మానసిక సమస్యలే కారణమని

ప్రాథమిక అంచనా

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

'హలో... 112. పోలీస్ సమాచార కేంద్రమేనా. నా పేరు గునుపూడి శ్రీనివాస్. నేను, నా తల్లిని, తమ్ముడిని కత్తితో నరికి హత్య చేశాను. ఎక్కడకు వచ్చి లొంగిపోమంటారు'. ఇవీ జిల్లా కేంద్రమైన భీమవరంలో జంట హత్యలకు పాల్పడిన నిందితుడు పోలీసులకు ఫోన్ చేసి మాట్లాడిన మాటలు. దీంతో అప్రమత్తమైన పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలికి రావడం, పోలీసుల హడావుడితో సోమవారం తెల్లవారేసరికి జంట హత్యల విషయం పట్టణం వాసులకు తెలిసింది. కన్న కొడుకే తల్లిని, ఆపై తమ్ముడిని నిద్రలోనే నరికి చంపడం, తానే పోలీసులకు ఫోన్ చేసి చెప్పడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మహాలక్ష్మి (ఫైల్‌ఫోటో)

రవితేజ (ఫైల్‌ఫోటో)

నిందితుడు శ్రీనివాస్

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకరపద్దయ్య వీధిలో మన్నా చర్చి ఎదురుగా ఉన్న ఇంట్లో గునుపూడి మహాలక్ష్మి (60), ఆమె కుమారులు శ్రీనివాస్, రవితేజ (33) నివాసం ఉంటున్నారు. అయితే కరోనాకు ముందు రవితేజ వేరే ప్రాంతంలో ఉద్యోగం చేసేవాడు. కరోనా సమయంలో ఇంటికొచ్చేసి ఇక్కడే ఉంటున్నాడు. అదే సమయంలో తండ్రి కరోనా బారిన పడి మృతి చెందారు. దీంతో తండ్రి చేసే ఫైనాన్స్ వ్యాపారం దెబ్బతినడం, ఇతర కారణాల రీత్యా శ్రీనివాస్, రవితేజలకు వివాహం కాలేదు. ఇటీవలకాలంలో శ్రీనివాస్ బయటకు వెళ్లినప్పుడల్లా ఎవరోకరితో గొడవ పెట్టుకుని రావడం పరిపాటిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న తమ్ముడు, తల్లి శ్రీనివాస్‌ను తరచూ మందలిస్తున్నారు. శ్రీనివాస్ వైఖరిలో పెద్దగా మార్పు రాకపోవడంతో అతడిని బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంచుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గాఢ నిద్రలో ఉన్న తల్లి, తమ్ముడిపై పైశాచికంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ విషయాన్ని సోమవారం తెల్లవారుజామున శ్రీనివాసే పోలీసులకు ఫోన్ చేసి తెలపడంతో బాహ్యప్రపంచానికి విషయం తెలిసింది.

ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్‌పి

పట్టణంలో జంట హత్యలు జరిగిన ప్రదేశాన్ని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ సోమవారం ఉదయం సందర్శించారు. హత్యలు జరిగిన ఇంట్లో ప్రత్యేకంగా ఆధారాల సేకరణకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్లూస్ టీం, పోలీస్ జాగిలం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ శ్రీనివాస్ తన తల్లిని, తమ్ముడిని హత్య చేశాడని సమాచారం రాగానే ఘటనా స్థలికి సిబ్బంది ఆధారాలు సేకరించారన్నారు. కరోనా సమయంలో తండ్రి చనిపోయిన తర్వాత శ్రీనివాస్ మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు ప్రాథమిక అంచనాకొచ్చినట్లు తెలిపారు. అయితే అతని సోదరికి సమాచారం ఇచ్చామని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి జైసూర్య, సిఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

సెకండ్ ఎఎన్‌ఎంల వేతనాలు పెంచి రెగ్యులర్ చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు నేతలు వాసుదేవరావు, ఆంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

సెకండ్ ఎఎన్‌ఎంలకు వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని కోరుతూ ఎపి కాంట్రాక్టు ఎఎన్‌ఎంల సంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యతో కూడిన వినతిపత్రాన్ని డిఎంహెచ్‌ఒ గీతాబాయికి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పని చేస్తున్నా రెగ్యులర్ చేయకపోవడం అన్యాయమన్నారు. ఇతర సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. రెగ్యులరైన వారితో సమానంగా పని చేస్తున్నా వివక్షతో చూడటం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. సరిపడా వేతనాలు, సెలవులు, ఫ్యామిలీ ఒకచోట, వృత్తి మరోచోట చేస్తూ సెకండ్ ఎఎన్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైద్యరంగంలో సేవలందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. జిల్లాస్థాయిలో పరిష్కారం చేయాల్సిన సమస్యలను కూడా పరిష్కరించడం లేదని, దీంతో ఆందోళన చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేయడంతోపాటు సమస్యల పరిష్కారానికి జరుగుతున్న పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు. యూనియన్ నాయకులు లక్ష్మీ ప్రసన్న, నైటింగేల్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టామన్నారు. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తామని, ఆపై రాష్ట్ర రాజధానిలో రెండు రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎం.విజయలక్ష్మి, వైఎస్.ప్రియదర్శిని, ఎం.పద్మావతి, ఎం.శశికళ పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సెకండ్ ఎఎన్‌ఎంలు

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ చదలవాడ నాగరాణితోపాటు డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు ప్రజల నుంచి 182 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యమూ వహించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల నుంచి సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం బాలోత్సవానికి సన్నద్ధం

డిసెంబర్ 12, 13 తేదీల్లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహణ

18 కల్చరల్, 15 అకడమిక్ అంశాలపై పోటీలు

బాలోత్సవ నిర్వహణా కమిటీ

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం బాలోత్సవాలకు సన్నద్ధమవుతోంది. మూడో పిల్లల పండుగను ఘనంగా నిర్వహించేందుకు బాలోత్సవ కమిటీ చురుగ్గా ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే బాలోత్సవ కమిటీ సభ్యులు పలు దఫాలుగా సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. భీమవరం బాలోత్సవాన్ని అత్యంత ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించడమే కాకుండా బాలురు, బాలికల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారి భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా నిర్వహణా కమిటీ ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగానే యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో భీమవరం బాలోత్సవ కమిటీ సమావేశం అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ భీమవరం బాలోత్సవం మూడో పిల్లల పండుగ డిసెంబర్ 12, 13 తేదీల్లో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 18 కల్చరల్, 15 అకడమిక్ అంశాలపై ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, అధికా రులు, అనధికారులు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు అందరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. నిర్వహణ కమిటీ ఉపాధ్యక్షుడు గాతల జేమ్స్, కల్చరల్ కమిటీ కన్వీనర్ బి.చైతన్య ప్రసాద్, అకడమిక్ కన్వీనర్ పి.శ్రీనివాసరాజు, కె.గోపాలశర్మ, ఎం. రాజేంద్రబాబు, మల్లుల శ్రీనివాస్, సిహెచ్.కుమారబాబ్జి, కెఎస్. రామకృష్ణప్రసాద్, జి.దుర్గాభవానిప్రసాద్, జి.రఫాయేలు, సత్యనా రాయణరాజు, అలుగు జాన్సన్, టి.ప్రసాద్, వై.తిలక్, కె.అశోక్, బి.వీరబాబు పాల్గొన్నారు.

సమావేశమైన బాలోత్సవాల నిర్వహణ కమిటీ

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్, అధికారులు

13న నరసాపురంలో మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

నరసాపురంలోని శ్రీ సూర్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో యువతకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నరసాపురంలోని శ్రీ సూర్య డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో సుమారు 13 ప్రముఖ కంపెనీలతోపాటు, మరికొన్ని ఇతర కంపెనీల్లో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వివిధ కంపెనీల్లో మొత్తం 500కుపైగా కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్, డిపిఒ బి.రామనాథ్‌రెడ్డి, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి వై.దోస్త్ రెడ్డి, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలకు విస్తృత ప్రచారం

ఉద్యమంగా సాగించాలి : ప్రచార వేదిక జిల్లా కమిటీ

ప్రజాశక్తి - తణుకు

రాజ్యాంగ పీఠిక పఠనం-ప్రతిజ్ఞ పేరుతో జిల్లాలో రాజ్యాంగ విలువలకు విస్తృత ప్రచారం ఒక ఉద్యమంగా సాగించాలని రాజ్యాంగ ప్రచార వేదిక జిల్లా సదస్సు పిలుపునిచ్చింది. సోమవారం స్థానిక సురాజ్య భవనంలో రాజ్యాంగ ప్రచార వేదిక జిల్లా సదస్సు జిల్లా ప్రచార వేదిక కన్వీనర్ డివివిఎస్.వర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డివివిఎస్.వర్మ మాట్లాడుతూ.. అన్ని విద్యాసంస్థల, పౌరసమాజ సంస్థల, అన్ని శ్రామిక సంఘాల భాగస్వామ్యంతో నిర్వహించాలని తలపెట్టిన ఈ కార్యక్రమానికి అన్ని సంస్థలు తమ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లావేదిక సభ్యులు, ఉద్దరాజు రామం ఫౌండేషన్ అధ్యక్షులు మంతెన సీతారాం మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ తక్షణ అవసరంగా ఉన్న సమయంలో రాజకీయాలకు అతీతంగా సాగిస్తున్న రాజ్యాంగ విలువల ప్రచార ఉద్యమంలో అన్ని సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.ప్రతాప్‌లు మాట్లాడుతూ.. తమ సంఘాల సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సదస్సులో సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పి.మురళీకుమార్, విశ్రాంత ప్రిన్సిపల్ సంకు మనోరమ, సీనియర్ న్యాయవాది డికెవి.ప్రకాష్, కడియం సూరిబాబు, శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రం పి.దక్షిణామూర్తి, మహిళా నాయకులు సికిలే పుష్పకుమారి, ఎ.అజయకుమారి, పౌరహక్కుల సంఘం నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, కార్మిక నాయకులు బొద్దాని నాగరాజు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, హేతువాద సంఘం నాయకులు జె.వెంకటేశ్వరరావు, జిల్లా విశ్రాంత జడ్జి లక్ష్మీ, పిపి శాస్త్రి తమ సంఘీభావాలు తెలియజేశారు. అనంతరం రాజ్యాంగ ప్రచార వేదిక- జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా డివివిఎస్.వర్మ, సభ్యులుగా డాక్టర్ రమేష్, ఎస్.మనోరమ, పి.మురళీకుమార్, పి.దక్షిణామూర్తి, సిహెచ్‌జివి.సుధాకర్, మంతెన సీతారాం, జోసెఫ్, మల్లుల శ్రీనివాస్(భీమవరం), పి.గోవింద్, ఎం.షర్మిల(తాడేపల్లిగూడెం), వై.అజయకుమార్, కెవి.రాయపు రాజు(పాలకొల్లు) ఏర్పాటు చేశారు.

సదస్సులో మాట్లాడుతున్న డివివిఎస్ వర్మ

గొల్లలకోడేరులో ఉన్మాదం

అనుమానంతో భార్య, బావమరిది, మామపై అల్లుడు కత్తితో దాడి

ఇద్దరి పరిస్థితి విషమం

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన భీమవరం డిఎస్‌పి జై సూర్య

పాలకోడేరు : గొల్లలకోడేరులో ఉన్మాది కత్తితో రెచ్చిపోయాడు. ముగ్గురిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అనుమానంతో భార్యను, అడ్డువచ్చిన బావమరిది, మామపై అల్లుడు కత్తితో దాడి చేసి చంపేస్తాం అంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. గొల్లలకోడేరు శివారు తుమ్మలగుంట పాలానికి చెందిన కడలి శ్రీలక్ష్మికి, అత్తిలి మండలం మంచిలికి చెందిన వీరవల్లి రామచంద్రరావుకు సుమారు 17 సంవత్సరాలు క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. గల్ఫ్‌లో ఉంటున్న రామచంద్రరావు భార్యపై అనుమానం పెంచుకుని తరచూ వేధింపులకు పాల్పడేవారు. గ్రామానికి వచ్చినప్పుడల్లా అనుమానంతో హింసించి, కొట్టడంతో రెండు సార్లు పుట్టింటికి వచ్చేసింది. పాలకోడేరు, అత్తిలి పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయగా రెండు సార్లు కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. అయినా రామచంద్రరావులో మార్పు రాకపోవడంతో సుమారు నెల రోజుల కిందట శ్రీలక్ష్మి తన పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం నిందితుడు రామచంద్రరావు తన మేనమామ కృష్ణతో కలిసి తుమ్మలగుంటపాలెం వచ్చారు. రోడ్డుపై వాకింగ్ చేస్తున్న భార్య శ్రీలక్ష్మిపై రామచంద్రరావు చాకుతో దాడి చేసి తీవ్రంగా గాయ పర్చాడు. అడ్డు వచ్చిన బామ్మర్ది రాజేష్, మామ సత్య నారాయణపై కూడా కత్తితో దాడి చేశాడు. దాడిలో రాజేష్ చేతి నాలుగు వేళ్లు తెగిపడినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన ముగ్గురుని 108 వాహనంలో భీమవరం ప్రయివేటు ఆసుపత్రికి చేర్చారు. శ్రీలక్ష్మి, రాజేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. నిందితుడుకు సహకరించిన మట్టపర్తి కృష్ణ అత్తిలి పోలీసే స్టేషన్లో లొంగిపోగా, నిందితుడు కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ మంతెన రఘువర్మ తెలిపారు. అయితే సంఘటనా స్థలాన్ని భీమవరం డిఎస్‌పి జైసూర్య పరిశీలించారు. కుటుంబ సభ్యులను, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రజాశక్తి విలేకరిపై దాడికి కారకులను అరెస్టు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన బస్టాండ్ వద్ద నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

హిందూపురం ఎంఎల్ఎ బాలకృష్ణ అనుచరులు వేస్తున్న రోడ్డుపై.. 'నాసిరకంగా రోడ్డు నిర్మాణం' అంటూ ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురించినందుకు జీర్ణించుకోలేని టిడిపి నాయకులు చిలమత్తూరు మండల ప్రజాశక్తి విలేకరి శంకర్‌పై దాడి చేయడాన్ని సిపిఎం మండల శాఖ తీవ్రంగా ఖండించింది. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలంటూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం వీరవాసరం బస్టాండ్ వద్ద నిరసన వక్తం చేశారు. టిడిపి మండల నాయకులు నాగరాజు యాదవ్, అతని కుమారుడు హరీష్ తదితరులను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం రాష్ట్ర మాజీ సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. కళ్లెదుట జరుగుతున్న అన్యాయాన్ని, అక్రమాలను, దుర్మార్గాలను ప్రజలకు తెలియజేసే బాధ్యత ప్రతికా విలేకర్లకు ఉంటుందన్నారు. విలేకర్లపై దాడులు చేయడమంటే పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.45 లక్షలు మంజూరు చేస్తే రూ.25 లక్షలతో నాసిరకంగా రోడ్డు వేస్తున్నారంటూ వార్త రాసినందుకు ఆ విలేకరి ఇంటికి వెళ్లి బెదిరించడం, దారి కాసి దుర్మార్గంగా కొట్టడం అన్యాయమన్నారు. ఏ ప్రభుత్వంలో ఎవరు అక్రమాలు చేసినా విలేకరులు వార్తలు రాస్తే అధికార బలంతో ఎంతమందిపై, ఎంతకాలం దాడులు చేస్తారని ప్రశ్నించారు. ఇటీవల కల్తీ మద్యాన్ని అక్రమంగా తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేది టిడిపి వారు కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇసుక, మట్టి అక్రమ రవాణ వ్యాపారం చేయడం టిడిపి నాయకులకు అలవాటుగా మారిందన్నారు. దాడికి గురైన విలేకరికి రక్షణ కల్పించాలని, అతనికి ఏమైనా జరిగితే స్థానిక పోలీసులు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని అనంతరం జరిగిన మండల సమావేశంలో నరసింహమూర్తి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలం విజయకుమార్, యండమూరి సుబ్బారావు, తాళ్లూరి రాము, యాళ్లబండి నారాయణమూర్తి, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

సోషలిస్టు సమాజంలోనే సమస్యలకు పరిష్కారం

సిఐటియు జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్

ఆకివీడు : ప్రజా సమస్యలకు పరిష్కారం సోషలిస్ట్ సమాజంలో మాత్రమే దొరుకుతుందని, పెట్టుబడిదారీ సమాజంలో గాలికి వదిలేస్తారని సిఐటియు జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. అక్టోబర్ విప్లవం జయప్రదమై 108 ఏళ్లు ఐన సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు మండల కన్వీనర్ బొడ్డుపల్లి రాంబాబు అధ్యక్షతన సభ జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా నాయకులు జెఎన్‌వి గోపాలన్ పాల్గొని మాట్లాడారు. రష్యాలో సోషలిస్ట్ వ్యవస్థలో ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సంపదలో 1 శాతం మంది చేతిలో 40 శాతం ఆదాయం ఉందన్నారు. 40 శాతం మంది చేతిలో మూడు శాతం మాత్రమే ఆదాయం కలిగి పేదలుగానే మిగిలిపోయారన్నారు. దేశంలో ధనికులు మరింత పెరుగుతున్నారన్నారు. దేశంలో కార్మికులకు కనీస వేతనాలు ఇప్పటికీ పెరగడం లేదని, ఖర్చులు మాత్రం రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా కొనసాగితే రానున్న రోజుల్లో దేశంలో మరింత పేదరికం పెరిగే ప్రమాదం ఉందని ప్రపంచ సూచికలు తెలియజేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే భారతదేశం రూపాయి విలువ పడిపోయిందని మరింత జటిలమవుతుందన్నారు. పేదవారికి సరైన వైద్య విద్య అందడం కష్టంగా మారుతుందని తెలిపారు. ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలి అంటే సోషలిజం ఒక్కటే మార్గమని గోపాలన్ వివరించారు. ఈ సభలో కె.తవిటినాయుడు, పింకీ అప్పారావు, డోకల లక్ష్మి, బొక్క కళ్యాణి, డొకల రవితేజ, బొర్రా శ్రీను, బి.ఆదాము, మనోహర్, పైడిశ్వరి, జి.లావణ్య, ఎస్‌కె.వల్లి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

సింగపూర్‌కు ఇద్దరు ఉపాధ్యాయులు

భీమవరం : రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ప్రభుత్వ ఖర్చులతో సింగపూర్ పంపాలని కూటమి సర్కారు నిర్ణయించింది. ఈ జాబితాలో జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం లభించింది. పాలకోడేరు మండలం వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు పంపన సాయిబాబు, భీమవరం చింతలపాటి బాపిరాజు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జిపిసి శేఖర్ రాజులకు చోటు లభించింది. అధునాతన విద్యా విధానాలపై సింగపూర్‌లో అమలు చేస్తున్న అధునాతన విద్యా విధానాలపై అధ్యయనం చేయనున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు.

విద్యుత్ తీగలపై పాదుల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన


తొలగించిన పాదులు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 19వ వార్డు రాయపేట లెనిన్ హైస్కూల్ ఎదురుగా విద్యుత్ స్తంభం, తీగలపై పాదులు పెరిగిపోయాయి. దీని పై సోమవారం ప్రజాశక్తిలో అల్లుకున్న నిర్లక్ష్యం అనే శీర్షికన వెలువడిన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం విద్యుత్ తీగలపై పెరిగిపోయిన పాదులను తొలగించారు.

ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 33 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతి అందిందని తహశీల్దార్ కె.రాజ కిషోర్ తెలిపారు. మొగల్తూరులోని డ్రెయిన్ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఒక వినతి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, పలు శాఖల అధికారులు ఉన్నారు.

నష్టపోయిన రైతులు, చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి భీమారావు

భీమవరం : మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులు, కౌలు రైతులను, చేనేత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సిపిఐ, ఎపి రైతు సంఘం, చేనేత కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యాన మొంథా తుపానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ తుపాను ప్రభావంతో నష్టపోయిన ఆహార పంటలకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యావన పంటలకు రూ.75 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోనే 47,576కు పైగా ఎకరాల్లో వరి పంట నష్టపోయిందని, ఇంకా తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం తదితర ప్రాంతాల్లో గణనీయంగా పంటలు నష్టపోయాయని గుర్తుచేశారు. రైతులతో పాటు కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.ఆనంద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఎం.సీతారాంప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జెడ్‌పి పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామసుందర్ సోమవారం మధ్యాహ్నం మండలంలోని శ్రీవేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. స్కూల్‌కు సంబంధించిన అన్ని రిజిస్టర్లు, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పాఠశాలకు పిఎంశ్రీ పథకం కింద వస్తున్న నిధులను సక్రమంగా, సకాలంలో మార్గదర్శకాలకు అనుగుణంగా ఖర్చు చేయాలని సూచించారు. స్కూల్లో అమలు చేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు సంబంధించిన నేమ్ బోర్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం 10వ తరగతి పరీక్షకు సంబంధించి టీచర్లకు పలు కీలక సూచనలు చేశారు. ఆయనతోపాటు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్, మండల విద్యాశాఖ అధికారి-2 ఉంగరాల నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట మధుసూదన్ రావు, ఎంఆర్‌సి అకౌంటెంట్ రాధాకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు వెంకట నరేంద్ర, త్రివేణి, నరసింహారెడ్డి, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ

ఆచంట: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. సమగ్ర శిక్ష జిల్లా ఆధ్వర్యాన ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర గ్రామాలకు చెందిన వికలాంగ బాలబాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం స్థానిక మండల ప్రజాపరిషత్ హైస్కూల్లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరువురు మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. ఈ శిబిరంలో కోల్కతా నుంచి ఆల్మ కో సంస్థ నుండి నిపుణులు ప్రభుత్వ వైద్య నిపుణులు కంటి, వినికిడి లోపం మేదో వైకల్యం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల వికలాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించారు. అనంతరం గతంలో గుర్తించిన బుద్ధిమాంద్యం గల విద్యార్థులకు ఎంఆర్‌టిఎల్ఎం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, జిల్లా సాహితీ విద్యా కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్, ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, పి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయంలో సిపి బ్రౌన్ జయంతి

తాడేపల్లిగూడెం : డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో సిపి బ్రౌన్ జయంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి బ్రౌన్ చిత్రపటానికి విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ బి.గోవిందరాజులు సిపి బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపి బ్రౌన్ జీవిత చరిత్రను, తెలుగు భాష కోసం ఆయన చేసిన సేవను, తన వ్యక్తిగత సమయాన్ని, సొంత డబ్బును లక్షల రూపాయలలో ఖర్చు చేసి నిఘంటువుల రూపకల్పన, గ్రంథ పరిరక్షణ కోసం గ్రంథాలయాలు ఏర్పాటు చేసారన్నారు. వాటి మూలంగా తెలుగు పరిశోధనకు, పండితుల చర్చలకు కేంద్రంగా వేమన పద్యాలు, వసుచరిత్ర, మనుచరిత్ర, ఆంధ్రమహాభారతం వంటి ముఖ్య గ్రంథాలను ప్రచురించి, వాటికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చి తెలుగు సాహిత్యానికి ఎన్నో సేవలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ మాధవి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సూర్యకుమారి, ఇతర ఉన్నత అధికారులు, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం మండలాన్ని పశ్చిమలోనే కొనసాగించాలి

ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ అనురాధకు వినతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గణపవరం మండలాన్ని యధావిధిగా పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి కోరారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒ అనురాధకి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గణపవరం మండలం చివర గ్రామాలకు 70 కిలోమీటర్ల దూరంలో ఏలూరు ఉందని, భీమవరం కేవలం 20 కిలో మీటర్ల దగ్గరగా ఉందని అన్నారు. ఏలూరు వెళ్లటానికి గణపవరం మండల ప్రజలకు దూరమై ఇబ్బందులు పడుతున్నారని, గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోని కొనసాగించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారని ఆయన తెలిపారు.

ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నసమారాధన

అన్న సమారాధనలో యాత్రికులు

కాళ్ల: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆకివీడు డిసి ఛైర్మన్ గోకరాజు శివబాబు అన్నారు. కాళ్లకూరు భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మూడో సోమవారం ఆలయం వద్ద దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన డాక్టర్ దాట్ల వెంకట రామరాజు ఆర్థిక సహకారంతో అన్న సమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తీకమాసంలో భోజనాలు ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ వేగేశ్న రామూర్తిరాజు, ఆలయ ఇఒ కూచంపూడి శ్రీనివాసరాజు, చేకూరి పుల్లంరాజు, సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్, ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్ రాజు, మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు అడ్డాల పద్మావతి, దేవస్థానం మాజీ ఛైర్మన్ అడ్డాల నాగరాజు, అడ్డాల గణపతి రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కుష్టు వ్యాధి లక్షణాలు గుర్తించాలి

సకాలంలో చికిత్స అందించడం ద్వారా సమూలంగా వ్యాధి నిర్మూలన : కలెక్టర్ చదలవాడ నాగరాణి

అవగాహనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఇంటింటా సర్వేలో భాగంగా కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి, సకాలంలో చికిత్సను అందించడం ద్వారా వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఈనెల 17వ తేదీ నుండి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా కుష్టివ్యాధిపై ప్రచురించిన అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా 17వ తేదీ నుండి 30వ తేదీ వరకు జిల్లాలో కుష్టువ్యాధి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దటంలో భాగస్వాములు కావాలన్నారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వపరంగా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న రోగులను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య సహాయం అందించగలిగితే వ్యాధిని త్వరితగతిన నివారించవచ్చునని తెలిపారు. కుష్టువ్యాధిపై విస్తృత అవగాహన కల్పించి 2027 సంవత్సరం నాటికి జీరో కేసులు ఉండాలని, కుష్టు వ్యాధి వల్ల ఒక్క వికలాంగుడు కూడా ఉండకూడదని ఆదేశించారు. డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వైద్య శాఖ అధికారి జి.గీతాభాయ్, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టిబి అధికారి హెచ్.రవి బాబు, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి, కలెక్టరేట్ ఎఒ వెంకటేశ్వరరావు, డివిజన్ ప్యారా మెడికల్ అధికారులు ఎంపి రమేష్, జివిఎస్ఎన్.మూర్తి, యు.వెంకటేశ్వర్లు, జి.సుభాష్, వి.క్రాంతి ఉన్నారు.

పరిశ్రమల అభివృద్ధి డైరెక్టర్‌గా సూరిబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా మండలంలోని వరిధనం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు పోతుల వివి.సత్యనారాయణమూర్తి(సూరిబాబు) నియమితులయ్యారు. ఈయన నియామకం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

నరసాపురం : నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఉత్తర్వుల ప్రకారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 14వ తేదీ బాలల దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీ, 15వ తేదీ పుస్తక ప్రదర్శన, పత్రిక పఠన పోటీ, వ్యాసరచన పోటీలు, 16వ తేదీ క్విజ్ పోటీలు, 17వ తేదీ కవి సమ్మేళనం పాటల పోటీ, పద్యాల పోటీ, వ్యాసరచన పోటీలు, 18వ తేదీ వక్తృత్వ పోటీ, చదరంగం పోటీలు, 19వ తేదీ మహిళా దినోత్సవం, బాలికలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు, 20వ తేదీ ముగింపు సభ, బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పుస్తక ప్రియులు, పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని రీడర్స్ ఫారం పండా త్రినాథ్, గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి కోరారు.

'మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి'

పెనుమంట్ర :పేదలకు విలువైన వైద్యం కోసం కృషిచేసిన వైసిపి అధినేత, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయంను బలపరచాలని పెనుమంట్ర వైసిపి నాయకులు అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే పూర్తి చేసి నిర్వహించాలని కోరుతూ కోటి సంతకాల కార్యక్రమం మండల కేంద్రం రజక పేటలో ప్రారంభించారు. పెనుమంట్ర, గరువు పంచాయతీల పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక వైసిపి నాయకులు, గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, టౌన్ అధ్యక్షులు తేతలి సుధీర్ రెడ్డి, టి.ప్రసన్న కుమార్ నాయకత్వం వహించారు. ప్రజలు ఉత్సాహంగా ఈ కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నారు.

జోజిబాబు మృతి తీరని లోటు

సంస్మరణ సభలో నేతలు

నరసాపురం : నరసాపురం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఈదా జోజిబాబుకి సిఐటియు నాయకులు ఘనంగా జోహార్లు అర్పించారు. స్థానిక పీతలవారి పేటలో ఆయన ఇంటి వద్ద అమరజీవి ఈదా జోజిబాబు సంస్మరణ సభను నిర్వహించారు. ముందుగా జోజిబాబు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ జోజిబాబు నరసాపురం మున్సిపాలిటీలో శానిటేషన్ మేస్త్రిగా పనిచేస్తూ సిఐటియు సంఘం అనుబంధంగా ఉన్న మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ద్వారా ఉద్యోగ కార్మిక హక్కుల కోసం జరిగిన పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించి కార్మికులకు, ఉద్యోగులకి అండగా ఉన్నారన్నారు. సిఐటియు ఆధ్వర్యాన ఉద్యోగులు, కార్మికులు, ప్రజా సమస్యలపై జరిగే ఉద్యమాల్లో ప్రజల పక్షాన నిలిచిన జోజిబాబు మరణం తీరనిలోటు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తాడి నాగభూషణం, పాలపర్తి లక్ష్మీనారాయణ, నోముల కొండ, నల్లి థామస్, మంచిలి నీలకంఠం పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

తణుకు : ఈనెల 2, 5వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 37వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా తణుకు స్థానిక మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కాలేజ్ విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అనేక పతకాలు కైవసం చేసుకున్నారని మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ.. రోలర్ హాకీ జూనియర్ విభాగంలో గూడూరి వేణుగోపాల్, ఇన్‌లైన్ హాకీ విభాగంలో గంటి జశ్వంత్ రజత పతకాలు సాధించారు. అండర్-12 క్యాడెట్ విభాగంలో భోగా మోక్షిత, మోయిత్రీదాస్, అండర్-15 సబ్ జూనియర్ విభాగంలో పొట్ల అమూల్య, అండర్-12 రోలర్ హాకీ విభాగంలో ఆరుగురు విద్యార్థులు, అండర్-15 సబ్ జూనియర్ విభాగంలో ఏడుగురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ.. ఇలాంటి క్రీడలు విద్యార్థుల్లో మంచి దేహ దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని కలుగజేస్తాయని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థును, శిక్షణ ఇచ్చిన కోచ్ అరెకపూడి భార్గవ్, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయిని లక్ష్మి పాల్గొన్నారు.

వెటరన్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

పాలకొల్లు : పాలకొల్లు కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ సారధ్యంలో క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు చెప్పారు. ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ వెటరన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రస్థాయి చదరంగం, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడమే కాకుండా క్రీడాకారులకు శిక్షణ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. కీర్తిశేషులు బుద్ధ అవతారం రాజు టెన్నిస్‌కు ఎనలేని కీర్తి తెచ్చారని, టెన్నిస్ పోటీలు ఉన్నంత వరకు ఆయన కీర్తి ఉంటుందని సభకు అధ్యక్షత వహించిన పోటీల ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు చెప్పారు. పోటీల నిర్వహణకు ప్రతి ఏడాది బుద్ధావతారం రాజు కుమారుడు వర్మ రూ.5 లక్షల చొప్పున ఇస్తున్నారని చెప్పారు. జిల్లా అడిషనల్ ఎస్‌పి కోటేశ్వరరావు, కాస్మో ఉపాధ్యక్షులు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

1న అంతర్జాతీయ వెబినార్

పాలకొల్లు : స్థానిక శ్రీదాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 1న డాక్టర్ ఎ.సత్యనారాయణ కన్వీనర్‌గా మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగం సంయుక్త నిర్వహణలో 'ట్రెండ్స్ ఆఫ్ గ్రాఫ్ థియరీ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ లైఫ్ సైన్సెస్' అనే అంశంపై జరగబోయే అంతర్జాతీయ వెబినార్ బ్రోచర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ పి.శోభారాణి ఆవిష్కరించారు. కళాశాల సిపిడిసి సెక్రటరీ గాదె జనార్ధన గుప్త ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సదస్సులో వలేగా యూనివర్సిటీ, ఇథియోపియా, ప్రొఫెసర్ రేపల్లె వివిఎస్.శ్రీనివాస్ రావు, ఇతర ప్రొఫెసర్లు ప్రసంగిస్తారని ప్రిన్సిపల్ తెలిపారు. వెబినార్ లింకు రాష్ట్రంలోని అన్ని కళాశాలలకు తెలియజేస్తామన్నారు.

సిఐటియు విస్తరణకు బాబూరావు ఎనలేని కృషి

వర్ధంతి సభలో నేతలు

ప్రజాశక్తి - పెంటపాడు

తాడేపల్లిగూడెంలో సిఐటియు ఉద్యమాన్ని విస్తరింప చేయడంలో చింతకాయల బాబూరావు కృషి చేశారని సిఐటియు నాయకులు అన్నారు. సోమవారం పత్తిపాడు గ్రామం గాంధీ రెడ్డి గూడెంలో కార్మికులు బాబూరావు వర్ధంతి సభ జరిపారు. ఈ వర్ధంతి సభలో గెల్లా పాపారావు, గోపి బాబూరావు చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిఐటియు నాయకులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ బాబూరావు 1984లో తాడేపల్లిగూడెం సిఐటియు ఉద్యమాన్ని విస్తరింప చేయడంలో కృషి చేశారని, 1985 నుండి 2005 వరకూ గూడెంలో అనేక సంఘాలు ఏర్పాటు చేస్తూ అసంఘటితరంగా కార్మికులకు వారి సమస్యలపైన, ఆర్థిక అంశాలపైన యాజమాన్యంతో అనేక సమస్యల పరిష్కారంలో రైస్ మిల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. సిపిఎం డివిజన్ కార్యదర్శిగా, సిఐటియు జిల్లా అధ్యక్షులు, కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, ఆల్ ఇండియా కమిటీ సభ్యుడిగా ఆ స్థాయికి ఎదిగారని కొనియాడారు. జిల్లాలో రైతుల సమస్యలపైన, వ్యవసాయ కార్మికుల సమస్యలపైన జిల్లా నలుమూలలా అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దత్తు రాము, పెంటారావు, గోపి, సన్యాసిరావు, అప్పారావు, బంగారియ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలి

ప్రారంభించిన ఎంఎంసి ఛైర్మన్ శివ

తణుకు: రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తణుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొండేటి శివ కోరారు. సోమవారం మండలంలోని కోనాల, దువ్వ గ్రామాల్లో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం మిల్లుకు చేరిన 48 గంటల్లో రైతు ఖాతాలో నగదును జమ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కూటమి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు తప్పుడు సమాచారం నమ్మవద్దని కోరారు. ఎఎంసి వైస్ ఛైర్మన్ వల్లూరి మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముద్దాపురం పిఎసిఎస్ అధ్యక్షులు ముళ్లపూడి శ్రీనివాస్, తణుకు సహాయ వ్యవసాయ సంచాలకులు జి.నరేంద్ర, మండల వ్యవసాయాధికారి కె.రాజేంద్రప్రసాద్, తణుకు తహశీల్దార్ అశోక్ వర్మ, కూటమి నాయకులు బూరుగుపల్లి రమేష్, మహారెడ్డి సత్యనారాయణ, పితాని మోహన్, ఆత్కూరి రామకృష్ణ, చిక్కాల వేణు, చిటికెన సత్యనారాయణ, తోట బుల్లిరాజు, పాలా నాగేశ్వరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 4 పతకాలు

పోలీసు సిబ్బందిని అభినందించిన ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా పోలీస్ శాఖకు చెందిన సిబ్బంది జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలలో పతకాలతో మెరిసారని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన గుంటూరులో అక్టోబర్ 11, 12 తేదీలలో జరిగిన 7వ నేషనల్ మాస్టర్స్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పి.సత్యనారాయణ 50 మీటర్స్ బటర్‌ఫ్లై విభాగంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను సాధించారు. అంతేకాకుండా కానిస్టేబుల్ డి.అనిల్ కుమార్ కేవలం ఒక విభాగంలోనే కాక, 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్స్ ఫ్రీ స్టైల్, 50 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ వంటి మూడు వేర్వేరు స్విమ్మింగ్ విభాగాలలో తృతీయ స్థానాన్ని దక్కించుకొని మూడు బ్రోంజ్ మెడల్స్‌ను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి సోమవారం వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే క్రీడలలో జాతీయస్థాయిలో మొత్తం నాలుగు పతకాలు సాధించిన వీరి అద్భుతమైన విజయం అన్నారు. గొప్ప విజయం తోటి పోలీసు సిబ్బందికి, యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుందని ఎస్‌పి పేర్కొన్నారు.

ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్లలో సెమీ కండక్టర్లు కీలక పాత్ర

హైదరాబాద్ ఐఐటి ఆచార్యులు డాక్టర్ సురేష్ కుమార్

తాడేపల్లిగూడెం : ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్లలో సెమీ కండక్టర్లు కీలక పాత్ర పోషిస్తాయని హైదరాబాద్ ఐఐటి ఆచార్యులు డాక్టర్ సురేష్ కుమార్ గార్లపాటి తెలిపారు. ఎపి నిట్‌లోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, మెటీరియల్స్ అండ్ మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యాన ఎఎన్ఆర్ఎఫ్ పిఎఐఆర్ అనే అంశంపై సోమవారం గెస్ట్ లెక్చరర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ పరికరాలను విద్యాసంస్థలు, పరిశ్రమలు ఎక్కువగా వినియోగిస్తున్నాయన్నారు. ఈ ప్రింటెడ్ ఎలక్ట్రానిక్స్ పరికరాలు తక్కువ ధరకే లభించడంతోపాటు అన్ని రకాల సబ్ స్ట్రేట్‌లకు ఎంతో అనుకూలంగా ఉంటాయని వివరించారు. మరో ముఖ్య అతిథి హైదరాబాద్ ఐఐటి ఆచార్యులు డాక్టర్ నరేంద్ర కుర్రా మాట్లాడుతూ మానవాళికి అత్యంత అవసరమైన విద్యుత్ శక్తిని సౌర, పవన, బయోమాస్, సముద్ర ఉష్ణ, జియో ఉష్ణ వంటి వనరుల నుంచి పొందవచ్చన్నారు. ఆయా వనరుల లక్ష్యం ఒక రకమైన శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడమేనని తెలిపారు. అనంతరం అతిధులను ఆచార్యులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎపి నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి ఆధ్వర్యంలో ఆచార్యులు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ సంతోష్ బెహ్రా కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ వీరేశ్ కుమార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సంతోష్ కుమార్, ఆచార్యులు డాక్టర్ పెద్దపాటి శంకర్, డాక్టర్ అల్లంశెట్టి శ్రీకాంత్, డాక్టర్ అమరేంద్ర రెడ్డి, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ తపస్, డాక్టర్ సురేంద్ర పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం : ఎడిఎ

నరసాపురం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కాయగూరలు తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉండవచ్చని వ్యవసాయశాఖ ఎడిఎ ప్రసాద్ అన్నారు. సోమవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ఏర్పాటు చేసిన మార్కెటింగ్ స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వారి పొలాలు అనుకొని ఉన్న గట్లపై కాయగూరలు, ఆకుకూరలు పండిస్తారన్నారు. వాటిని ప్రతి సోమవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మార్కెటింగ్ చేస్తున్నారని, ప్రకృతి సిద్ధంగా పండించిన వాటిని ఆహారంలో తీసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుటుందని తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

టిడిపి నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్నె రమేష్

పెనుగొండ రూరల్ : మండలంలోని నడిపూడి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని టిడిపి నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్నె రమేష్ అన్నారు. సోమవారం నడిపూడి గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్‌అండ్‌డబ్ల్యుఎస్ అధికారులు అనుమతులు లేకుండా మరుగు బోదెలు, పారిశుధ్య పనుల పేరుతో సర్పంచి కుమారుడు కాంట్రాక్టు పనులు చేయడం విశేషమన్నారు. ఇంటి పన్నులలో సుమారు ఆరు లక్షలు, కుళాయి పన్నులలో సుమారు రెండు లక్షలు మాయం చేశారన్నారు. పంచాయతీ సొమ్ములు సర్పంచి కుటుంబ సభ్యుల అకౌంట్‌కు జమ చేసుకొని ఇష్టారాజ్యంగా వాడుకున్నారన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి వారికి చెల్లించవలసిన బిల్లులు చెల్లించకుండా వాడుకున్నారని, తమ బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టు దారుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో టిడిపి నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి, వార్డు సభ్యులు మన్నె రమేష్, టిడిపి నియోజకవర్గ వైద్య విభాగం కార్యదర్శి యాగంటి రామకృష్ణ, కాంగ్రేకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేయాలి : ఎంఎల్‌ఎ

నరసాపురం : ప్రభుత్వానికి, ప్రజలకు జర్నలిస్టులు వారధిలా పనిచేయాలని విఫ్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నరసాపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అవినీతి, ప్రజా సమస్యల్ని వెలికితీయడంలో జర్నలిస్టులు నిజాయితీగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు మాట్లాడారు. అనంతరం జర్నలిస్టులు ఎంఎల్‌ఎ నాయకర్‌ను ఘనంగా సత్కరించారు. ఆర్‌డిఒ దాసిరాజు, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సిపిఎం నాయకులు కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.

In the Court of the III Additional District Judge at Kakinada
O.S. No. 86/2018

Between:
Anupoju Satyanarayana ...*Plaintiff*
AND
Mathurthi Ratna Kumari & others ...*Defendants*

To:
D-6: Mathurthi Brahmaji, S/o. (late) Satyanarayana, R/o. Inam, Tallarevu Mandal, Kakinada District.
D-7: Mathurthi Govindamma @ Padma, W/o. (late) Vara Prasadu, House wife, Tallarevu, Tallarevu Mandal, Kakinada District.
D-10: Girijala Varalakshmi, W/o. Nageswara Rao, House wife, Tanuku, Tanuku Mandal, West Godavari District.
D-13: Pedapati Baby, W/o. Achari, House wife, Marteru, Tanuku Mandal, West Godavari District.

పై నెంబరు దావాలో 6వ, 7వ, 10వ మరియు 13వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 18-11-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
టి.వి.నరసింహారావు, అడ్వకేట్
కొత్తపేట, సెల్: 9849083925

అగ్రహారం విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడల్లో స్థానం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో దెందులూరు మండలం గోపన్నపాలెం వ్యాయామ విద్య కళాశాలలో శనివారం నిర్వహించిన అండర్-14, అండర్-17 విభాగాల్లో ఖోఖో జిల్లా జట్టుకు తమ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో గోకవరపు మోహన్(7వ తరగతి), కర్రి సాయిశ్రీ అంజలీదేవి(9వ తరగతి), అలాగే అండర్-17 విభాగంలో పాలవలస సురేఖ(10వ తరగతి) ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మరింత కృషి చేసి రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కూంద్రస్య శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ప్రకటన

ఈ క్రిందినుదహరించిన నా మారుతీ స్విఫ్ట్ రి నెం : AP16CC6139 కారు సెప్టెంబర్ 30, 2025 నుంచి కనిపించుట లేదు. కార్ డాష్ బోర్డులో బ్యాంకు అఫ్ ఇండియా చెక్కు (నెంబర్.025615) కూడా ఉంది. కనుక సదరు డేట్ నుంచి ఈ కారుకు, చెక్కుకు చెందిన ఏ లావాదేవీలు చెల్లవు & నాకు సంబంధించవు. పై కారు కు సంబందించి సమాచారం తెలిస్తే ఈ క్రింది వారికి తెలియచేయండి.

జన్ను వినయ్ కుమార్
సెల్: 8639792488.

పాస్‌పోర్టు పోయినది

వేగేశ్న రామచంద్రరాజు, తండ్రి,: రామచంద్ర రాజు, డోర్ నెంబర్ 6-10-1/1, సుగర్ కాలనీ, పాలకొల్లు, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియ జేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి B1058685 నెంబర్ పాస్‌పోర్ట్ పొందాను. అది పడిపోయాక నేను ది 20-07-2019లో హైదరాబాద్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి G173792 నెంబర్ పాస్‌పోర్ట్ పొంధియున్నాను. ది.10-08-2025న పాలకొల్లులోని మా ఇంటి నుంచి పాలకొల్లులోని జెరాక్స్ సెంటర్‌లో నా పాస్‌పోర్ట్ జెరాక్స్ తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.
నా సెల్ నెంబర్ **9849922622**

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.27/2024
in O.S.No.67/2017

DHR: దేవ కోటేశ్వరరావు
Vs
JDr's:
1.గ్రంధి కనకదుర్గ
2.గ్రంధి పార్వతి

డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు గాను 2వ JDR తాలుకు యీ దిగువ తెలియపర్చిన ఆస్తిని ది.26-11-2025వ సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట వేలం వేయబడును. కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును.

షెడ్యూలు
West Godavari District, Mogalthuru SRO Mogalthuru Mandal Ramannapalem Village Zeroyati wet land an extent of Ac.0.25 cents in R.S.No.1162/2 with in the following boundaries :
East : Land belongs to Grandhi Madhuram and Grandhi Venkatesh
South: Land belongs to Kukkala Veera Swamy
West : Land belongs to Grandhi Kanaka Durga
North: Land belongs to Kukkala Satyanarayana
With all usual, easementary rights
DHR Value : 5,00,000/-
Amin Value : 8,00,000/-
JDR Value : More than 50,00,000/-

Challa Danayyanaidu
నరసాపురం Advocates, Narsapuram.
తేది.7-11-25 Cell: 9441086919

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.27/2024
in O.S.No.67/2017

DHR: దేవ కోటేశ్వరరావు
Vs
JDr's:
1.గ్రంధి కనకదుర్గ
2.గ్రంధి పార్వతి

డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు గాను 2వ JDR తాలుకు యీ దిగువ తెలియపర్చిన ఆస్తిని ది.26-11-2025వ సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట వేలం వేయబడును. కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును.

షెడ్యూలు
West Godavari District, Mogalthuru SRO Mogalthuru Mandal Ramannapalem Village Zeroyati wet land an extent of Ac.0.25 cents in R.S.No.1162/2 with in the following boundaries :
East : Land belongs to Grandhi Madhuram and Grandhi Venkatesh
South: Land belongs to Kukkala Veera Swamy
West : Land belongs to Grandhi Kanaka Durga
North: Land belongs to Kukkala Satyanarayana
With all usual, easementary rights
DHR Value : 5,00,000/-
Amin Value : 8,00,000/-
JDR Value : More than 50,00,000/-

Challa Danayyanaidu
నరసాపురం Advocates, Narsapuram.
తేది.7-11-25 Cell: 9441086919